క్లుప్తంగా

'ప్రొటోకాల్‌పై కవిత మాట్లాడడం హాస్యాస్పదం'


పరమేశ్వర్

జనగామ: రాష్ట్రంలో పదేళ్ల పాటు భోగభాగ్యాలు, అధికారిక హోదాలను అనుభవించిన కల్వకుంట్ల కవితి ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించడంతో ప్రజాధనం, ప్రొటోకాల్ గురించి మాట్లాడడం హాస్యాస్పదమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రామగల్ల పరమేశ్వర్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో కవితి అంతులేని అవినీతి, అక్రమాలకు పల్పడ్డారని ఆరోపణలు గుప్పించారు. ఇంద్రవెల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి సభ నిర్వహించడం నిధుల దుర్వినియోగం అంటూ కవిత చేసిన వ్యా ఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించడమే అన్నారు. గాంధీ కుటుంబం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. దేశం కోసం గాంధీ కుటుంబం అనేక త్యాగాలు చేసిందన్నారు. దేష్ కీ నేత కేసీఆర్ పేరుతో దేశమంతా మీరు మీ పార్టీ చేసిన హంగామా అంతా ఇంతా కాదని, అందుకే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపించారన్నారు.

నియామకం


అనిల్‌గౌడ్

స్టేషన్‌ఘన్‌పూర్: రాబోయే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో యూత్‌కాంగ్రెస్ పక్షాన ఘన్‌పూర్ నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా ప్రస్తుత యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బస్వగాని అనిల్‌గౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఘన్‌పూర్‌లో అనిల్‌గౌడ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో యూత్‌కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా నియామకం కావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పదవిలో నియమించిన యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, కా ంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్‌నియోజకవర్గ ఇంఛార్జీ సింగపురం ఇందిర, కీసర దిలీప్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా రాజేష్‌నాయక్



కొడకండ్ల: వరంగల్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా మండలంలోని మైదంచెరువుతండాకు చెందిన ధరావత్ రాజేష్‌నాయక్ నియామకమైనాడు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఈ మేరకు ఆయనకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయక్ మాట్లాడుతూ గడిచిన అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికల్లో మరింత ఉత్సాహంతో పనిచేసి యువతను జాగృతం చేసి పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా భారీ మెజార్టీ దక్కేలా కృషి చేస్తానని, తన నియామకం కోసం సహకరించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపాడు.

కోతులు, కుక్కలతో ఇబ్బందులు


పంటపొలాలను నాశనం చేస్తున్న కోతులు

చిల్పూరు: ఇటీవల కుక్కలు, కోతులతో మండలంలోని నష్కల్ గ్రామంలో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఆకేరు వాగు పరిసర ప్రాంతాల్లో రైతులు వేసిన వరినారు, నాట్లు వేసిన పొలాల్లో పంటను కోతుల గుంపులు నాశనం చేస్తున్నాయని, వాటిని తరిమేందుకు ప్రయత్నిస్తే రైతులపైకి వస్తున్నాయి. దీంతో ఇళ్లకు కూడా వెళ్లకుండా పంట పొలాల వద్దే కాపలా ఉండాల్సి వస్తోందని రైతులు శాగంటి మణి, గంటే ఉపేందర్‌యాదవ్, రంగు రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇళ్లలో నుంచి బయటకు వస్తే కుక్కల బెడద ఎక్కువగా ఉందని, దానికి తోడు వాటికి వింత వ్యాధి రావడంతో పిల్లలను ఒంటరిగా బయటకు పంపలేకపోతున్నారు. ఈ విషయమై ప్రత్యేకాధికారి మధుసూదన్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, పంచాయతీ కార్యదర్శి స్వప్న స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని అందుకు తాము సహకరిస్తామని అంటున్నారు.


రాత్రివేళ స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా..

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా, ఎవరూ అధైర్యపడొద్దు, అవసరమైన సమయంలో ప్రతి ఒక్కరికి ఉచితంగా చికిత్స అందిస్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యేకు చెందిన నీలిమ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నియోజకవర్గ పేషెంట్లను ఆయన పరామర్శించారు. అక్కడి డాక్టర్లతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు వైద్యం అవసరమైన సమయంలో ఆధార్ కార్డు తీసుకుని నీలిమ ఆస్పత్రికి వెళ్లవచ్చని తెలిపారు. జనగామ సమగ్రాభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు.


నీలిమ ఆస్పత్రిలో నియోజకవర్గ పేషెంట్లపై వాకబు చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీహరి

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తాళ్లపల్లి వెంకటయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామానికి చేరుకుని మృతుడి భార్య మాజీ సర్పంచ్ అనసూర్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. ఎంపీటీసీ తాళ్లపల్లి ఉమసమ్మయ్య, నాయకులు ఎడవెల్లి కష్టారెడ్డి, మామిడాల లింగారెడ్డి, మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి, ఇల్లందుల సుదర్శన్ ఉన్నారు.

బెలిదె వెంకన్నకు శుభాకాంక్షలు తెలిపిన కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా వివాహ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రఘునాథపల్లికి చెందిన ఎం.లలితకు రూ.1.20లక్షలు, స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన కె.లింగమ్మకు రూ.లక్ష విలువైన ఎల్‌ఓసీ పత్రాలను కడియం శ్రీహరి అందించారు.

వాసవీ క్లబ్ చైర్మన్‌గా దారం అశోక్



లింగాలఘణపురం: మండలంలోని కుందారం గ్రామానికి చెందిన దారం అశోక్ లింగాలఘణపురం మండల వాసవీ క్లబ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అదేవిధంగా వైస్ చైర్మన్‌గా శివ రామకృష్ణ, కార్యదర్శిగా మెతుకు అనంతర రాములు, కోశాధికారిగా బెలదె శ్రీధర్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఆదివారం వరంగల్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ ఎన్నికను ఆమోదించారు.

పట్టణ పేపర్ డిస్ట్రిబ్యూటర్ల సంఘం ఎన్నిక

జనగామ: పట్టణ పేపర్ డిస్ట్రిబ్యూటర్ల నూతన సంఘం అధ్యక్షుడిగా తాడురి సంతోష్, కార్యదర్శి బచ్చు విశ్వనాథ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేపర్ డిస్ట్రిబ్యూటర్ల వినతులను పరిష్కరించాలని కోరారు. ప్రతి ఏజెంట్‌కు సబ్సిడీపై ఎలక్ట్రిక్ బైక్, ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్లకు హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా వర్తింపజేయాలని, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో అవకాశం కల్పించాలన్నారు. మహారాష్ట్రలో ఏజెంట్లు, డిస్ట్రిబ్యూటర్లకు అమలవుతున్న పథకాలన్నీ తెలంగాణలో అమలు చేసే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్, గౌరవ అధ్యక్షుడు నంద లక్ష్మణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గన్ను కార్తీక్, సభ్యులు యాకేష్, భాస్కర్, పాము ప్రభాకర్, మోటే మనోజ్, మణి, రాజు, పవన్, రాజేందర్, సురేందర్, నరేందర్, కళ్యాణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

యూ ట్యూబ్ సాంగ్ ఆవిష్కరణ



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన పల్లె నరేందర్‌గౌడ్ రూపొందించిన 'ఓమనిషి నీబుద్ధి ఎందుకో గడ్డి తింటున్నది' అనే సందేశాత్మక యూ ట్యూబ్ గీతాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ సట్ల రాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత చదువు, ఉద్యోగాలతో పాటు ఇలాంటి సమాజహిత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇప్పగూడెం ఎల్లమ్మగుడి చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల యాకయ్య, సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, చట్ల రాజు, పల్లె లక్ష్మీ నారాయణ, డాక్టర్ అశోక్, రంజిత్ పాల్గొన్నారు.

షిరిడీలో జనగామ చిన్నారి పేరిణి నృత్యం

జనగామ: మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రం షిరిడీలో ఆదివారం జరిగిన సాయి నృత్య హారతి పురస్కరించుకుని పట్టణంలోని గుండ్లగడ్డకు చెందిన మాచర్ల హరిణి- కిరణ్ దంపతుల కుమార్తె దీక్షిత పేరిణి నృత్యంలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న చిన్నారి స్థానిక శ్రీ చంద్రకళ అకాడమీ మాస్టర్ సంతోష్ ఆధ్వర్యంలో పేరిణి నృత్యంలో శిక్షణ పొందుతోంది. షిరిడీసాయి సంస్థానం, చంద్రకళా నిలయం ఆధ్వర్యంలో జరిగిన సాయినృత్య హారతి నాట్యంలో పేరిణి నృత్యం చేసేందుకు దీక్షితకు ఆహ్వానం వచ్చింది. చిన్నారి నృత్యం చూసిన భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. దీక్షిత అద్భుత ప్రదర్శనకు డిప్లమా ఇన్ ఆనంద నాట్యం, పేరిణి వ్యవస్థాపకుడు పెరుమాండ్ల సంతోష్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంది. తన కూతురు ప్రతిభను చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మురిసిపోయారు.


పేరిణి నృత్యం చేస్తున్న దీక్షిత

అభివృద్ధి పనులు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం, రంగరాయగూడెం, అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణం వద్ద జాతర కమిటీ మాజీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మందపురం ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. అజయ్‌రెడ్డి, రవీందర్, రాజు, శ్రీను, ఎండీ.మహిపాషా, దామెర రాజు, ధర్మయ్య, కుమార్, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు..

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టగ్రామంలో మారేపల్లి గూడేనికి చెందిన యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్, దాత శ్రీధర్‌రావు, చిర్ర నాగరాజు హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు.

పరామర్శ

పాలకుర్తి: గూడూరు గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ, ఐబీటీ చుక్కా రామయ్యను ఆదివారం హైదరాబాద్‌లో సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ ఆలీ పరామర్శించారు. ఆనారోగ్యంతో బాధపడుతున్న రామయ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

రఘునాథపల్లి పురోహితుడికి అర్చక స్మామ్రాట్ అవార్డు



రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రంలోని స్టేషన్ శివాలయం పురోహితుడు నందిగామ పుల్లయ్యశర్మకు తిరుమలలో ఆదివారం సరస్వోయిరామ అకాడమీ రుద్రాక్ష వైభవం సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అర్చక సామ్రాట్ అవార్డు వరించింది. శివాలయంలో రెండు దశాబ్దాలుగా వేద పండితులుగా దైవసేవ కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను తిరుపతి దేవస్థానం అర్చకుల చేతుల మీదుగా అవార్డుతో పాటు స్వర్ణ కంకణం అందుకున్నారు.

సామాజిక సేవా గుణం అలవర్చుకోవాలి


ఇంటిని ప్రారంభించిన రవీందర్

కొడకండ్ల: సామాజిక సేవా గుణాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని ఎంపీఐ, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ కోరారు. ఫ్రెండ్లీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధురాలికి దాతల సహకారంతో మండలకేంద్రంలో నిర్మించిన ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడే వచ్చి ఎవరికి స్వయంగా సాయం చేయడని, సాయం చేసిన వారినే దేవుడు, దైవత్వంగా భావించాలని, తాను సంపాదించిన సంపాదనలో ఇతరులకు సహాయం చేసిన వారే నిజమైన ధనవంతులన్నారు. నిరుపేద కుటుంబాలకు సాయంలో భాగంగా మూడో ఇంటిని నిర్మించిన ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసన్న కుమార్, దాతలు పాల్గొన్నారు.

మూతపడిన జనపనార పరిశ్రమ

● ప్రభుత్వ సహకారంలేక ఏడాదికే మూసివేత
● కూలీలకు రెండు నెలల వేతన బకాయి
● ఇండస్ట్రీ తెరవడం కోసం కూలీల ఎదురుచూపులు



ఏనెబావి సమీపంలో మూతపడిన భీష్మ జనపనార పరిశ్రమ

లింగాలఘణపురం: తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక భీష్మా జూట్(జనపనార) ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్‌ను లింగాలఘణపురం మండలం ఏనెబావి సమీపంలో 2022 జూలైలో ప్రారంభించారు. దీంతో లింగాలఘణపురం మండలం, యాదాద్రి భువనగిరి జిల్లాలోని కట్లెం, సిరిపురం, మాణిక్యాపురం, ఏనెబావి, టంగుటూరు, శారాజీపేట గ్రామాలకు చెందిన వంద మంది కూలీలకు ఉపాధి లభిస్తుందని ఎంతో ఆశతో పనిలో చేరారు. ముడిధారాన్ని నేసి నెలకు 5 లక్షల గోనె సంచులను తయారు చేసే సామర్థ్యంతో కంపెనీ మొదలైంది. సుమారు ఏడాది కాలం పాటు కూలీలు పనికి వెళ్లి ఉపాధి పొందారు. ఆరు నెలల క్రితం జూట్ ఇండస్ట్రీ యాజమాన్యం ఉత్పత్తి చేసిన గోనె సంచులు కొనుగోలు కావడంలేదని ఆరు నెలల క్రితం మూసివేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా భీష్మా జూట్ ఇండస్ట్రీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులు సుమారు రూ.9.20 కోట్లతో ఏనెబావి సమీపంలో ప్రారంభించారు. కానీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి అమ్ముకోవడం జరిగింది. ఇలా ఏడాది కాలం పాటు అటు కేరళతో పాటు, కొంత ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకొని కంపెనీ ఇప్పటి వరకు కొనసాగించారు. గత ప్రభుత్వంలోని మంత్రులు, అధికారులకు తమ కంపెనీ నుంచి గోనె సంచులు కొనుగోలు చేయాలని విజ్ఞాపన పత్రాలు అందజేసినా ఫలితంలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల వద్దకు కూడా వెళ్లి విన్నవించుకున్నారు. గోనె సంచులను కేంద్రంలోని జూట్ కమిషనర్ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లోని సివిల్ సప్లయ్, ఫుడ్‌కార్పొరేషన్లకు పంపిణీ చేస్తుంది. రాష్ట్ర సహకారం ఉంటే స్థానికంగా తయారైన సంచులు వినియోగించుకొనే వెసులుబాటు కల్పిస్తే ఇక్కడి ఇండస్ట్రీ కొనసాగి కూలీలకు ఉపాధి కూడా లభిస్తుంది.

రెండు నెలల వేతనాలు బకాయిలు

జూట్ ఇండస్ట్రీలో పని చేసిన సుమారు వంద మందికి పైగా కూలీలకు కంపెనీ యాజమాన్యం రెండు నెలల వేతనాలు బకాయి ఉంది. ఆరు నెలలుగా కంపెనీ మూసివేయడంతో కూలీలు పనికోసం ఎదురు చూస్తున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ.12వేల వేతనం ఇచ్చినప్పటికీ రెండు నెలల బకాయిలు ఉన్నాయి. ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వకపోవడంతో యాజమాన్యాన్ని అడిగి అడిగి వేసారిపోయారు.

కంపెనీ తెరిస్తే బాగుండు

కంపెనీ తెరిస్తే బాగుండు.. ఏడాదిగా స్థానికంగా పని లభించింది. ఎంతో సంతోషంగా ఉన్నాం. ఆరు నెలల నుంచి కంపెనీ మూసివేశారు. నెల వేతనం రావాల్సి ఉంది. అయినా పర్వాలేదు. కంపెనీ తెరిస్తే ఇక్కడోళ్లకే పని దొరుకుతుంది. చాలా మంది ఎదురు చూస్తున్నారు.

– బుస్సా, రాజు

ప్రభుత్వ సహకారం ఉంటే తెరుస్తాం..

ప్రభుత్వ సహకారం ఉంటే త్వరలో తెరుస్తాం. గత ప్రభుత్వం ఎలాంటి సహకారం అందజేయలేదు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుంది. కూలీలకు నెల వేతనం ఇవ్వాల్సి ఉంది. త్వరలో చెల్లిస్తాం. కంపెనీ కూడా ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ, జూట్ ఇండస్ట్రీ

భగవద్గీతపై విస్తృత ప్రచారం

దేవరుప్పుల: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై వేదిక ప్రతినిధులు పల్లెల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఆదివారం మండంలోని ధర్మాపురంలో ప్రబోధ సేవాసమితి, హిందు జ్ఞాన వేదిక ప్రతినిధులు ఇంటింటా ప్రచారం చేసి పుస్తక ప్రదర్శన చేపట్టారు. హిందూ దేశంలో భగవద్గీత చదవని వినని మనిషి గాని, భగవద్గీత లేని ఇల్లు కాని ఉండకూడదన్నారు. కార్యక్రమంలో భువనగిరి, జనగాం, చేర్యాల, తొర్రూర్,కమిటీ సభ్యులు పంచాంక్షారీ,రామరాజు, భాస్కర్, రాము, శంకర్, లక్ష్మీనారాయణ, సాయిరాజ్, అశోక్, ఉపేందర్, లింగస్వామి, కోటి, మల్లేష్, ప్రసాద్, శ్రీనాథ్, పార్థీవ్‌తేజ్, లత, ధనలక్ష్మి, జయమ్మ, రమాదేవి, శ్రీజ, లావణ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.


భగవద్గీత గ్రంథాలను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

ధర్మకంచలో ఓటరు నమోదు


ఓటరు నమోదు చేసుకుంటున్న పట్టభద్రులు

జనగామ: పట్టణంలోని ధర్మకంచలో 13, 6, 30 వార్డులకు సంబంధించి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తిప్పారపు విజయ్‌కుమార్, పానుగంటి ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

బచ్చన్నపేట: పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఓటరు నమోదు కార్యక్రమలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటరు నమోదుకు ఈనెల 6 చివరి తేదీ అని తెలిపారు. డిగ్రీ మెమోతో పాటు ఓటరు గుర్తింపు, ఆధార్ కార్డులను తీసుకెళ్లి ఓటరు నమోదు చేసుకోవాలని చెప్పారు. మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, నాయకులు పెండెం నాగేష్, దొంతుల చెంద్రమౌళి, గద్ద రాజు, జూకంటి గణేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఓటు హక్కు నమోదులో పాల్గొన్న బీరప్ప

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82 సంవత్సరం పదో తరగతిలో చదివిన బాల్యస్నేహితులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని తాటికొండ మల్లన్న గండి సమ్మక్క–సారలమ్మ ప్రాంగణం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా పలుకరించుకుని నాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఉబ్బని మల్లేశం, బాబురావు, రాజేందర్, పురుషోత్తమ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్, శ్రీను, వెంకటేశం, మధుసూధన్ రెడ్డి, గోపాలరత్నం, వెంకటమ్మ, విజయ, రమాదేవి, మణెమ్మ, నిర్మల, రమేష్, సుధాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

సంక్షిప్త సమాచారం

సామాజిక సేవా రంగంలో రమేష్‌కు అవార్డు

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన మారపాక రమేష్ సామాజిక సేవా రంగంలో జాతీయ అవార్డును అందుకున్నారు. కాగా, యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలో ఆదివారం జాతీయ పురస్కారాలను ప్రకటించారు. అందులో భాగంగా ఆర్గనైజర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ఉచిత కరాటే శిక్షణ

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ప్రతి రోజు విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు వేద కరాటే మాస్టర్ పెచ్చెటి త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. అందుకే సొంత గ్రామం బచ్చన్నపేటలో ఉచితంగా విద్యార్థులకు రెండేళ్ల కోర్సును అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

ఆలింపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

బచ్చన్నపేట: ఆలింపూర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో హైదరాబాద్ బోడుప్పల్‌లోని అభయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ వాసవీ ఆధ్వర్యంలో 200 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని మాజీ సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి అన్నారు.

విరాళం

బచ్చన్నపేట: బండనాగారంలో నిర్మిస్తున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి పలువురు గ్రామస్తులు విరాళాలు అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ శివరాత్రి రాజనర్సు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఇప్ప మధుసూదన్‌రెడ్డి రూ.10,116, అలాగే పలువురు విరాళాలు అందజేశారని చెప్పారు.

ఆర్థికసాయం



దేవరుప్పుల: మండల కేంద్రంలోని కొత్త కాలనీకి చెందిన తోటకూరి ఉపేందర్ మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి బాల్యమిత్రులు రూ.10 వేల సాయం అందించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ప్రతిభా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొడకండ్ల: మండల స్థాయి ప్రజ్ఞోత్సవ ప్రతిభా పోటీల్లో మండలకేంద్రానికి చెందిన ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. పలు అంశాల్లో ప్రతిభను చాటి ఆరు బహుమతులు పొందినట్లు హెచ్‌ఎం ప్రభాకర్ తెలిపారు.

పంచాయతీ మాజీ పాలకవర్గాలకు సన్మానం


జఫర్‌గఢ్: పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంపీటీసీలు


చిల్పూరు: పదవీకాలం ముగిసిన వారితో శ్రీధర్‌రావు

జఫర్‌గఢ్: ఇటీవల పదవీకాలం ముగిసిన గ్రామ పంచాయతీ పాలకవర్గానికి మండల కేంద్రంలో జీపీ కార్యదర్శి రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిలి హాజరై మాజీ సర్పంచ్ బల్లెపు నర్సింగరావు, ఉప సర్పంచ్ నంచర్ల లత యాదగిరితో పాటు వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. మండల కోఆప్షన్ సభ్యులు ఎండి నజీర్‌తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభినందనీయం

చిల్పూరు: ఐదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధిలో సర్పంచ్, వార్డు సభ్యులు కీలక పాత్ర వహించడం అభినందనీయమని చిల్పూరు ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. పల్లగుట్టలో పదవీకాలం ముగిసిన సర్పంచ్, వార్డుసభ్యులను ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ బొట్టు మానస, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, జీడి ఆనందం, దార అశోక్‌పాల్, పసునూరి వెంకట్‌రెడ్డి, పొట్లపల్లి శ్రీపతిరావు తదితరులు ఉన్నారు.